క్లుప్తంగా

దెబ్బతిన్న పంటల పరిశీలన



బ్రాహ్మణపల్లిలో పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శోభారాణి

మాడ్గుల: ఈదురు గాలులతో కూడిన వర్షానికి దెబ్బతిన్న పంటలను ఏడీఏ శోభారాణి సోమవారం పరిశీలించారు. మండల పరిధి నాగిళ్ల, అన్నబోయిన్‌పల్లి, బ్రాహ్మణపల్లి, అర్కపల్లి, ఇర్విన్ గ్రామాల్లో పర్యటించి, వివరాలను సేకరించారు. శనివారం రాత్రి కురిసిన వర్షానికి ప్రాథమిక అంచనా ప్రకారం 350 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏతో పాటు మాడ్గుల మండల వ్యవసాయ అధికారి అరుణ కుమారి, ఏఈఓలు నవ్య, ప్రియాంక, రాజేష్‌లు ఉన్నారు.

అందరికీ ఉపయోగపడే విధంగా మినీ మార్కెట్



పీఏసీఎస్ పరిసరాలను పరిశీలిస్తున్న చైర్మన్ హన్మంత్‌రెడ్డి తదితరులు

మంచాల: ఈ నెల 28న మండల పరిధి ఆరుట్ల గ్రామంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో కూరగాయల మార్కెట్ నిర్మాణం పనులు ప్రారంభం కానున్నాయని పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం గ్రామంలోని పీఏసీఎస్ భవన పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. రైతులకు, స్థానిక ప్రజలకు ఉపయోగంగా ఉండే విధంగా మినీ కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టనున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, నాబార్డు నిధులతో నిర్మాణ పనులు కొనసాగనున్నాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జెనిగె వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, నాయకుడు మాదగోని జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాల్ పశువుల సంత వేలం రూ.82 లక్షలు

యాచారం: మాల్ పశువుల సంత వేలం పాట సోమవారం నిర్వహించారు. జీపీ కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో చేపట్టిన పాటలో ముగ్గురు పోటీపడ్డారు. ఇందులో నల్గొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన నవీన్ యాదవ్.. సంత నిర్వాహణను రూ.82 లక్షల ఐదు వేలకు దక్కించుకున్నారు. తైబజార్‌ను మాల్ గ్రామానికి చెందిన గుడుగుంట్ల కృష్ణ రూ.3.15 లక్షలకు కైవసం చేసుకున్నారు. సంత, తైబజార్ దక్కించుకున్న వారు 2026 మార్చి 30 వరకు కొనసాగుతారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పడకంటి కవిత, చిన్నోళ్ల పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఆరు దరఖాస్తులు

ఇబ్రహీంపట్నం: ప్రజావాణిలో ఆరు దరఖాస్తులు అందాయని రెవెన్యూ డివిజన్ కార్యాలయ ఏఓ నర్సయ్య తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణికి ఆర్డీఓ అనంతరెడ్డి హాజరుకాలేదు. ఆయన స్థానంలో ఏఓ అర్జీలను స్వీకరించారు. రైతులు, ప్రజల నుంచి అందిన దరఖాస్తులను ఆయా శాఖలకు పంపి, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని పేర్కొన్నారు.

28న తైబజార్ వేలం

కడ్తాల్: కడ్తాల్ గ్రామ పంచాయతీ 2025– 26 సంవత్సరానికి తై బజార్ వేలం పాట ఈ నెల 28 ఉదయం 11 గంటలకు జీపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీఓ లాలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు పంచాయతీకి ఎలాంటి బకాయి ఉండరాదని, రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు. వేలం కనిష్ట ధర రూ.9,07,750గా నిర్ణయించామని, దానికంటే తక్కువగా వేలం పాడటానికి అనుమతి లేదని పేర్కొన్నారు. తైబజార్ వేలం మొత్తానికి సరిపడా ఆస్తి.. పాట పాడిన వ్యక్తి కలిగి ఉండాలని స్పష్టంచేశారు. వేలం దక్కించుకున్న వ్యక్తి, పాట మొత్తంలో 25 శాతం నగదును అదే రోజు పంచాయతీలో చెల్లించాలని, మిగతా రూపాయలు ఈ ఏడాది డిసెంబర్ లోపు 3 వాయిదాల్లో చెల్లించాలన్నారు. లేని పక్షంలో పాట రద్దు చేస్తామని వెల్లడించారు.

కట్ట రికార్డుల్లో లేదు..

ఇబ్రహీంపట్నం రూరల్: పోల్కంపల్లిలోని కత్వాన్ చెరువు కట్ట రికార్డుల్లో లేదని, పూర్తి స్థాయిలో సమగ్రంగా రికార్డులు పరిశీలిస్తామని ఇరిగేషన్ డీఈ చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. మండలం పరిధి పోల్కంపల్లి గ్రామంలో ఇరిగేషన్ డీఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ హరితలు పర్యటించారు. నాగులమ్మ చెరువు నుంచి బురుకుంటకు పారే కాల్వను పరిశీలించారు. ఎక్కడైనా కబ్జాకు గురైతే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాల్వలు, కట్టలు, కుంటలను కాపాడతామని చెప్పారు. ఎంకేఎంకేఎస్ నాయకులు నర్సింహ, శంకర్, లక్ష్మయ్య, శ్రీను, భిక్షపతి ఉన్నారు.

మిగిలింది ఐదు రోజులే..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో ఆరు రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో ఇంటి పన్ను వసూలుకు జీపీ అధికారులు వేగం పెంచారు. సెలవులు రోజుల్లో గ్రామాల్లో పర్యటిస్తూ లక్ష్యం దిశగా పరుగులు తీస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో నేటి వరకు 79.89 శాతం పూర్తి కాగా.. 30వ తేదీలోపు వందశాతం పన్ను వసూలు ప్రణాళితో ముందుకు సాగుతున్నారు.

- ఇబ్రహీంపట్నంలో పన్ను వసూలు 79.89 శాతం పూర్తి
- లక్ష్యం చేరువకు వేగం పెంచిన అధికారులు
- సెలవు రోజుల్లో గ్రామాల్లో పర్యటన



పోల్కంపల్లి పంచాయతీ కార్యాలయం

ఇబ్రహీంపట్నం రూరల్: మార్చి నెల వచ్చిందంటే అధికారులకు గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటాయి. ఏడాది మొత్తం చేసిన పనులకు కొలమానంగా ఈ నెల ఒక్కటే ప్రామాణికం కానుంది. నిత్యం చేసే పనులు ఒకెత్తైతే.. పన్ను వసులు చేయడం మరో ఎత్తు. ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖలో పని చేసే జీపీ కార్యదర్శులు, ఎంపీఓలు, ఎంపీడీఓలు, డీఎల్‌పీఓల నుంచి డీపీఓ వరకు ఇదే టెన్షన్ ఉంటుంది. గ్రామ పంచాయతీలు స్వయం పాలక సంస్థలు కావడంతో, వాటి పన్నులు వారే వసూలు చేసుకొని, పంచాయతీల్లో జమ చేసి, అభివృద్ధికి ఖర్చు చేయాలి. పన్ను వసూలు భారం అనుకున్నప్పటికీ తప్పకుండా రాబట్టాల్సిందే. లేదంటే కలెక్టర్ నుంచి ఆదేశాలు పకడ్బందీగా ఉంటాయి. నిర్లక్ష్యం చేసిన వారిపై వేటు కూడా పడుతుంది.

రూ.కోటి టార్గెట్..

ఇబ్రహీంపట్నం మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో చర్లపటేల్‌గూడ, దండుమైలారం, కప్పపహాడ్, కర్ణంగూడ, ముకునూర్, నాగన్‌పల్లి, నెర్రపల్లి, పోచారం, పోల్కంపల్లి, రాయపోల్, తుర్కగూడ, తులేకలాన్, ఉప్పరిగూడ, ఎల్మినేడు ఉన్నాయి. నల్ల బిల్లులు, ఇంటి పన్నుతో పాటు ఇతర వాణిజ్య పన్ను ప్రతి సంవత్సరం మార్చి వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాదికి మండలంలో రూ.1,04,27,038 లక్ష్యంగా నిర్ణయించారు. గత మార్చి నుంచి నేటి వరకు పంచాయతీ అధికారులు రూ.83,30,222 (79.89 శాతం) పన్ను వసూలు చేశారు. ఇంకా రూ.20,96,816 రాబట్టాల్సి ఉంది. మండలంలో అత్యధికంగా కర్ణంగూడలో 88.61 శాతం వసూలు కాగా.. అతి పెద్ద రెండో గ్రామం రాయపోల్‌లో అత్యల్పంగా 61.91 శాతం వసూలు చేశారు.

నిలిచిన ప్రభుత్వాల నిధులు

గ్రామ పంచాయతీల నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెల నిధులు మంజూరు చేస్తాయి. కానీ కేంద్రం నుంచి రావాల్సిన 15వ ప్రణాళిక సంఘం నిధులు, రాష్ట్రం నుంచి రావాల్సిన ఎస్‌ఎఫ్‌సీ గ్రాంట్స్ నిలిచిపోయాయి. 30 నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు, 15 నెలలుగా కేంద్రం నిధులు నిలిచిపోయాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుత గడ్డుకాలంలో పన్నులు వసూలు చేస్తే తప్ప.. పంచాయతీల్లో కార్మికులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి.

లక్ష్యం సాధ్యమేనా..



పన్ను వసూలు చేస్తున్న అధికారులు

గతేడాది నుంచి నేటి వరకు 79.89 శాతం పన్ను వసూలు చేశారు. ఈ నెల 30వ తేదీ వరకు 100 శాతం వసూలు చేయాల్సి ఉంది. కానీ.. మిగతాది రాబట్టడానికి, సెలవు, పండగలు పోను ఐదు రోజుల గడువే ఉంది. ఈ నేపథ్యంలో కొన్ని గ్రామాల్లో అధికారులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కానీ కొన్ని గ్రామాల్లో జీపీ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. వారం రోజుల క్రితం.. సెలవు దినం ఆదివారం అయినా.. డీఎల్‌పీఓ పర్యటించారు. లక్ష్యంపై ఫోకస్ పెట్టారు. నెలాఖరులో గా మిగతా రూ.20 లక్షల వసూలుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

ఇంటింటికీ తిరిగి..



వందశాతం పన్నుల వసూలుకు కృషి చేస్తున్నాం. నిత్యం గ్రామాల్లో పర్యటిస్తున్నాం. కలెక్టర్, డీపీఓల ఆదేశాలను పాటిస్తున్నాం. ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించి, పన్ను వసూలు చేస్తున్నాం. లక్ష్యాన్ని చేరుకుంటాం. పన్ను వసూలు అయితేనే.. పల్లెల్లో మౌలిక సదుపాయలు కల్పించడానికి వీలుంటుంది. ఇప్పటికే కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి.

–శివ, జీపీ కార్యదర్శి, దండుమైలారం

లక్ష్యం చేరుకుంటాం



మండలంలో ఇప్పటి వరకు 79 శాతం పన్ను వసూలు చేశాం. పంచాయతీ కార్యదర్శులు అదే పనిలో ఉన్నారు. సమష్టిగా పని చేస్తున్నారు. ప్రజలు సహకరిస్తే.. లక్ష్యం కష్టమేమి కాదు. 30వ తేదీ లోపు 100 శాతం పన్ను వసూలు చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

– రఘు, ఎంపీఓ, ఇబ్రహీంపట్నం

ఆశ కార్యకర్తల అరెస్టు



పోలీసుల అదుపులో ఆశలు, నాయకులు

ఆమనగల్లు: ఆశల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ.. హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో తలకొండపల్లి మండలంలో సోమవారం ఉదయం పలువురు ఆశ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కార్యకర్తలకు రూ.18 వేల వేతనంతో ఇతర సౌకర్యాలు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, మాట నిలుపుకోవాలని సూచించారు. అనంతరం ఆశలు, సీఐటీయూ నాయకులను సొంత పూచికత్తుపై పోలీసులు విడిచిపెట్టారు. అరెస్టు అయిన వారిలో సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య, ఆశ కార్యకర్తల సంఘం నాయకురాళ్లు శిరీష, సుజాత, నర్సమ్మ, చంద్రకళ తదితరులు ఉన్నారు.

పట్టుపరిశ్రమపై 'పైలెట్' రైతులకు అవగాహన



రైతులకు మల్బరీ తోటలపై వివరిస్తున్న అధికారులు

యాచారం: రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మొండిగౌరెల్లి, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి గ్రామాల రైతులకు పట్టుపరిశ్రమపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో ఇక్కడి రైతులను సోమవారం షాద్‌నగర్ సమీపంలోని కోరింతకుంటతండాకు తీసుకెళ్లి, అక్కడి సాగు పద్ధతులను వివరించారు. పట్టుపరిశ్రమ వలన లాభం పొందే విధానం, మల్బరీ తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఇందులో మూడు గ్రామాల నుంచి 60 మంది రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ అధికారులు సౌమ్య, శక్రునాయక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ముస్లింలు, కాంగ్రెస్ నాయకులు

మంచాల: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామంలో ముస్లింలకు పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఉపవాసకుల దీక్షలను విరమింపచేశారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ మాజీ సభ్యుడు మహ్మద్ సలాం ఆజాద్, పార్టీ నాయకులు రమాకాంత్‌రెడ్డి, చంద్రయ్య ముదిరాజ్, సురేష్, ఇమ్రాన్, ఆజీమ్, గఫార్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించాలని ధర్నా



పాఠశాల ఎదుట బైఠాయించిన కార్పొరేషన్ అధికారులు, కార్మికులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ 16వ డివిజన్‌లో ఉన్న జాన్ మిల్టన్స్ హైస్కూల్ యాజమాన్యం 10 సంవత్సరాలుగా ఇంటి పన్ను చెల్లించలేదు. దీంతో సోమవారం పాఠశాల ఎదుట కార్పొరేషన్ అధికారులు, కార్మికులు బైఠాయించారు. ఇప్పటివరకు రూ.3 లక్షలకు పైగా పాఠశాల నిర్వాహకులు బాకీ పడ్డారని, ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించకుండా ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. ఇంటి పన్ను చెల్లించాలని పాఠశాల సిబ్బందిని కోరగా.. సహకరించలేనందుకు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ సుందర్, సెక్షన్ ఆఫీసర్, వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్స్, జవాన్‌లు, వర్క్స్ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, స్వీపర్లు తదితరులు ఉన్నారు.

నక్షబాటను కాపాడండి

మంచాల: మండల పరిధి నోముల– మంచాల గ్రామాల మధ్య కబ్జాకు గురైన నక్ష బాటను కాపాడాలని మంచాల గ్రామ రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నోముల నుంచి మంచాల మీదుగా జైనమ్మ గూడ నుంచి జాపాల వరకు తాతల కాలం నుంచి నక్షబాట(బండ్ల బాట) ఉందని పేర్కొన్నారు. గతంలో ఉపాధిహామీ పథకం కింద బాట నిర్మాణంలో భాగంగా మట్టి రోడ్డు వేశారని తెలిపారు. నిత్యం తామంతా ఈ బాటలో రాకపోకలు సాగిస్తుంటామని, ఇది రైతులకు ఎంతో ఉపయోగకరమైన దారి అని చెప్పారు. ఇటీవల కొంతమంది రియల్ వ్యాపారులు బాటను కబ్జా చేసి, కడీలు పాతి రాక పోకలను అడ్డుకున్నారని ఆరోపించారు. కడీలను తొలగించి, రోడ్డును పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు సత్తారి కిష్టారెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏవైసీ అధ్యక్షుడిని కలిసిన షాబుద్దీన్



ఉదయ్‌భానును సన్మానిస్తున్న షాబుద్దీన్

కడ్తాల్: అఖిల భారత యువజన కాంగ్రెస్ (ఏవైసీ) అధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్‌ను, కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ సోమవారం ఢిల్లీ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక ఎన్నికల్లో.. పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని చిబ్ సూచించినట్లు షాబుద్దీన్ తెలిపారు.

న్యాయవాది హత్య అత్యంత దారుణం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రముఖ న్యాయ వాది ఇజ్రాయెల్ హత్య అత్యంత దారుణమని న్యాయవాదులు అన్నారు. సోమ వారం నగరంలోని సంతోష్‌నగర్‌లో జరిగిన న్యాయవాది హత్యను.. కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ జిల్లా మాజీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, ఐఏఎల్ నాయకులు పి.రాములు, వెంకటేష్ యాదవ్, నర్సిరెడ్డి, మిర్యాల జగన్, రాములు నాయక్‌లు తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకే రక్షణ లేకపోతే, సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను ప్రభుత్వాలు వెంటనే అమలులోకి తేవాలని కోరారు.



ఆస్మత్‌పూర్‌లో రోడ్డు పక్కన టమాటను పారబోసిన రైతులు

రైతు కష్టం రోడ్డు పాలు

అష్టకష్టాలకు ఓర్చి, రేయింబవళ్లు కంటికి రెప్పలా కాపాడుకున్న పంటకు మద్దతు ధర కరువైంది. దీంతో కలత చెందిన రైతన్న.. దిగుబడిని రోడ్డు పాలు చేశాడు. ఆదాయం సంగతి ఎలా ఉన్నా, కనీసం పెట్టుబడి కూడా దక్కేటట్లు లేదని, పంటను మార్కెట్‌కు తరలిస్తే రవాణా ఖర్చు భారమని వాపోతూ.. టమాటను ఇలా రోడ్డుపక్కన కుప్పగా పారబోశారు.

– మంచాల



ఇబ్రహీంపట్నం: కాగడాల ప్రదర్శనలో సీపీఎం, డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు



ఆమనగల్లు: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

యోధుల పోరాట స్ఫూర్తి.. యువతకు ఆదర్శం

ఇబ్రహీంపట్నం: దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, యువత ముందుకు సాగాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు సామెల్ సూచించారు. ముగ్గురు మహనీయుల వర్ధంతి సందర్భంగా సోమవారం ఇబ్రహీంపట్నంలో కాగడాల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారి ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుగ్గరాములు, జంగయ్య, ఎల్లేష్, నర్సింహ్మా, ఆనంద్, ప్రభుదాస్, పురుషోత్తం, శంకర్, విగ్నేష్, డీవైఎఫ్‌ఐ నాయకులు దశరథ, చరణ్, రాఘవేందర్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శ్రీకాంత్, వినయ్, సాయికుమార్, మనోజ్‌లు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో డీవైఎఫ్‌ఐ, సీపీఎం ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం ఏరియా కమిటీ కన్వీనర్ పెంటయ్య, డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, భగత్‌సింగ్ యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్, ప్రధాన కార్యదర్శి రవి, స్థానికులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల దందా

ఇబ్రహీంపట్నం: ప్రస్తుత విద్యాసంవత్సరం పూర్తిగాకముందే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల దందాను ప్రారంభించాయని ఎస్‌ఎఫ్‌ఐ ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యదర్శి ఎ.తరంగ్ ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సిబ్బందిని ఇళ్లకు పంపిస్తూ.. పేరెంట్స్‌ను ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఎక్కువ అడ్మిషన్లు చేసిన వారిని హెడ్‌మాస్టర్‌గా నియమిస్తామని ఉపాధ్యాయులను మభ్యపెడుతున్నారని తెలిపారు. బ్యానర్లు, కరపత్రాలతో హంగామా చేస్తున్నారన్నారు. ముందస్తు క్యాంపెయిన్ నిర్వహిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దశరథ్‌నాయక్ తదితరులు

కడ్తాల్: మానవ సేవయే మాధవ సేవగా భావించి, వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. యువజన సంఘాల ఐక్యవేదిక– వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో.. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ సహకారంతో మండల కేంద్రంలోని అన్మాస్‌పల్లి కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం స్థానిక నాయకులతో కలిసి దశరథ్‌నాయక్ ప్రారంభించారు. చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నిర్వాహకులను స్థానికులు అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేష్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా, కోఆప్షన్ మాజీ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు రాఘవేందర్, లాయక్‌అలీ, కుమార్, అశోక్, బ్రహ్మచారి, శివకుమార్, సందీప్‌రెడ్డి, గోపీకృష్ణ, నాగరాజు, గణేశ్, వెంకటేశ్, కుమార్, చంద్రశేఖర్, మహేశ్ తదితరులు ఉన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్‌గౌడ్




న్యాయవాది చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మహేశ్వరం: సీనియర్ న్యాయవాది ఎర్రవాపు ఇజ్రాయెల్‌ను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించి, మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు.. హత్యకు గురైన న్యాయవాది ఎర్రవాపు ఇజ్రాయెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహాయం కోసం వచ్చిన మహిళకు అండగా నిలిచినందుకు దస్తగిరి అనే వ్యక్తి, న్యాయవాది ఇజ్రాయెల్‌ను కత్తితో అతి కిరాతకంగా పొడిచి హత్య చేయడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్రంలో న్యాయవాదులు ఎదుటివారికి సహాయం చేయడం తప్ప ఇతరులకు హాని చేయరని పేర్కొన్నారు. న్యాయవాదిని హత్య చేసిన దస్తగిరిని కఠినంగా శిక్షించి, ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇజ్రాయెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహేశ్వరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు ఉన్నారు.

పన్నులు తగ్గించకుంటే దీక్ష చేస్తాం

బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు భిక్షపతిచారి



మాట్లాడుతున్న నాయకులు

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి పన్నులు తగ్గించకుంటే ఈ నెల 27న మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తామని మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు పసునూరి భిక్షపతిచారి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కనకదుర్గ కన్వెన్షన్‌లో బీజేపీ మాజీ కార్పొరేటర్లు, నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నులు తగ్గించాలని గతంలో పార్టీ ఉద్యమాలు చేసిందన్నారు. ఇంటి పన్ను తగ్గించకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో పన్నులు తగ్గించాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, అడ్మినిస్ట్రేషన్ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశామన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే దీక్షలు చేస్తామని, కార్పొరేషన్ పరిధిలోని పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386